
సాక్షి నిర్మల్

శనివారం । 14 । అక్టోబర్ । 2023



చకచకా శరన్నవరాత్రి ఏర్పాట్లు
బాసరలో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. దసరా వరకు కొనసాగే ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. IVలో▸



కల్తీ కట్టడే ప్రధానం
మనం కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యతగా ఉన్నాయా అంటే ఏమో అనుమానమే. నేడు 'ప్రపంచ ప్రమాణాల దినోత్సవం' (వరల్డ్ స్టాండర్స్ డే) సందర్భంగా ప్రత్యేక కథనం. IIలో▸

గరిష్టం/కనిష్టం
34.6 /22.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకునికి డాక్టరేట్



అధ్యాపకున్ని అభినందిస్తున్న డైరెక్టర్

భైంసా: ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడు భూక్య రవికుమార్‌కు ఉస్మానియ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బహుళస్థాయి ఇన్వర్టర్‌ఫెడ్ ఇండక్షన్ మోటర్ డ్రైవ్ కోసం మాడ్యులేషన్ టెక్నిక్ విశ్లేషణ రూపకల్పన అమలు అనే అంశంపై రవికుమార్ పరిశోధన చేశారు. మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన బిక్యా నాయక్ తండాకు చెందిన రవికుమార్ ట్రిపుల్ ఐటీలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న రవికుమార్‌ను ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్‌తోపాటు, అధ్యాపకులు అభినందించారు.

'కార్మిక చట్టాలను హరిస్తున్న కేంద్రం'


మాట్లాడుతున్న రాములు

నిర్మల్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను హరిస్తోందని 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ.. నిబద్ధతతో సీఐటీయూ పోరాడుతుందని పేర్కొన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, కోశాధికారి బి.లలిత, జిల్లా కమిటీ సభ్యులు శైలజ, రజియా, కేమెంటు వెస్లీ, అతీక్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సమావేశానికి జిల్లా వాసి


స్వదేశ్ పర్కిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ సంఘాల సమాఖ్య ఆహ్వానం మేరకు జిల్లాకు చెందిన స్వదేశ్ పర్కిపండ్ల శుక్రవారం రాత్రి యూఏఈ బయలుదేరి వెళ్లారు. ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడైన స్వదేశ్ పరికిపండ్ల గల్ఫ్ సంక్షేమం కోసం గల్ఫ్ దేశాల్లో తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న అనే సామజిక, సాంస్కృతిక సంస్థలు రెండు రోజులు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సంఘాలు, వాటి ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దుబాయ్‌లో ఈనెల 14న కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. అన్ని సంఘాల సలహాలు, సూచనల సారాంశాన్ని ఒక తీర్మానంగా తయారు చేసుకుని 15న నిర్వహించబోయే తెలంగాణ గల్ఫ్ కార్మికుల ఆత్మగౌరవ సభలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారు. అనంతరం మూడు రోజుల పాటు యూఏఈలో తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎంబసీ ద్వారా పొందుతున్న సహాయం గురించి తెలుసుకుంటారు.

బీఆర్‌ఎస్ జెండా ఎగరాలి


పార్టీలోకి స్వాగతిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి నిర్మల్ నియోజకవర్గంలో మూడోసారి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో భాగ్యనగర్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లాలో మూడోసారి పార్టీ గెలిచేలా పనిచేయాలని సూచించారు. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, పాకాల రాంచందర్, బీఆర్‌ఎస్ నాయకుడు అల్లోల గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిండా ముంచిన సోయా



ముధోల్ మండలం
మచ్కల్ గ్రామానికి చెందిన రైతు మనోహర్‌పటేల్ గత తొమ్మిదేళ్లుగా సోయాపంట సాగుచేస్తున్నాడు. యేటా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. గతేడాది సోయాలో కేడీఎస్ రకం సాగుచేశాడు. ఈ పంట ఎకరానికి 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈయేడు కూడా ఇదే దిగుబడివస్తుందని ఆరు ఎకరాల్లో కేడీఎస్ రకం విత్తనం వేశాడు. పంట మొన్నటివరకు బాగానే ఉంది. ఆకు పసుపు పచ్చగా మారడంతో వర్షాలకు ఇలా అయ్యిందేమో అనుకున్నాడు. తీరా ఆకు కిందరాలేసరికి సోయాపంట కోత దశకు వచ్చింది. రెండు రోజుల క్రితం పంటను హార్వెస్టర్‌తో కోయించాడు. ఆరు ఎకరాల్లో కేవలం 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఎకరం భూమిలో వచ్చే దిగుబడి ఆరు ఎకరాల్లో వచ్చేసరికి తీవ్రంగా నష్టపోయానని మనోహర్ పటేల్ ఆవేదన వ్యక్తంచేశాడు. ఇలా నిర్మల్ జిల్లాలో ఈయేడు సోయా పంటవేసిన రైతులంతా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ముధోల్ నియోజకవర్గంలో 80శాతం రైతులు సోయాలో కేడీఎస్ రకం విత్తనాలువేశారు. పంట కోసే సమయానికి వస్తున్న దిగుబడి చూసి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.


ముధోల్ మండలం మచ్కల్‌లో కోతకు వచ్చిన సోయాపంట

- పసుపు రంగులోకి మారిన పంట
- పూర్తిగా తగ్గిన దిగుబడి
- చిన్నసైజులో గింజలు
- వాతావరణ మార్పో, నకిలీ విత్తనామో తెలియని దుస్థితి
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన

భైంసా: జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం 60 వేల ఎకరాల్లో సోయాపంట సాగు చేశారు. సోయా పంట వేసిన నుంచి వర్షాలు బాగానే కురిశాయి. యేటా వర్షాలులేక సోయా పంటకు నీటితడి ఇచ్చేవారు. ఈయేడు ఆ అవసరంరాలేదు. భారీ వర్షాలు కురవడంతో సోయా పంట ఏపుగా పెరిగింది. పంట చూసి రైతులంతా మురిసిపోయారు. పూతదశలో వర్షం కురవడంతో ఈయేడు దిగుబడి పెరుగుతుందని ఆశించారు. తీరా పంట పూర్తిగా పసుపు రంగులోకి మారింది. ఆకులన్నీ రాలిపోయాయి. ఇప్పుడు కోత సమయంలో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.

ఏం లోపమో తెలియక...
పదేళ్లుగా ముధోల్ నియోజకవర్గంలో సోయా పంట ఎక్కువగా వేస్తున్నారు. రైతు కూలీలు అవసరం లేకుండా తక్కువ సమయంలోనే ఒకేసారి పంటచేతికి రావడంతో రైతులంతా ఇటువైపే మళ్లారు. ఈయేడు ఇదే పంటను సాగుచేశారు. కానీ ఈయేడు పదేళ్లలో లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. సోయాపంట పూర్తిగా దెబ్బతీసి రైతులను కోలుకోలేని విధంగా చేసింది. పంట ఇలా మారడానికి ఏలోపమో రైతులకు తెలియడంలేదు. భారీ వర్షాలు కురిసి పంట ఇలా మారిందా అంటే పక్కనే ఉన్న మహారాష్ట్రలోనూ ఇవే వర్షాలు ఉన్నాయి. అక్కడ పంట ఇలా దెబ్బతినలేదు. విత్తనలోపం అనుకుంటే మొలకలు బాగానే వచ్చాయి. పూత, కాత దశలోనే మొక్క రోగనిరోధక శక్తి పూర్తిగా కోల్పోయింది. నాణ్యతలేని విత్తనాలే అయి ఉండవచ్చని రైతులు అభిప్రాయ పడుతున్నారు. నాలుగు నెలలు కష్టపడ్డా ఆశించిన స్థాయిలో దిగుబడిలేక సోయారైతులు తీవ్రంగా నష్టపోయారు.

పెరిగిన ఖర్చులు...
సోయా పంటపై యేటా రెండు సార్లు రసాయన మందులు పిచికారీ చేసేవారు. విత్తనం వేశాక గడ్డి మందు ఒకసారి కొట్టి కాత, పూత దశలో మరోసారి తెగుళ్లు రాకుండా పిచికారీ చేసేవారు. ఈయేడు రైతులు మూడు నుంచి నాలుగుసార్లు పిచికారీ చేశారు. ఒక్కో ఎకరానికి విత్తనం నుంచి పంటకోసే వరకు రూ.23 వేల వరకు ఖర్చుచేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ సోయాకు రూ.4,100 నుంచి రూ.4,600 పలుకుతోంది. భైంసాలోని గాంధీగంజ్‌లో ఇప్పటికే సోయా విక్రయాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఈయేడు సోయా పంటకు క్వింటాలుకు రూ.4,600 మద్దతు ధర ప్రకటించింది. దిగుబడి తగ్గడంతో రైతులకు పెట్టుబడి డబ్బులు కూడా చేతికిరావడంలేదు.


హార్వెస్టర్‌తో సోయా పంట కోస్తున్న దృశ్యం

కోతదశలో పంట...

నాలుగు రోజులుగా సోయాపంట కోతలు ప్రారంభమయ్యాయి. హార్వెస్టర్లతో పంటను కోస్తున్నారు. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. ఈయేడు సోయాగింజ సైజు పూర్తిగా చిన్నగామారింది. కాత దశలో ఉన్న సమయంలో గింజ పూర్తిగా నిండలేదు. కేడీఎస్ రకంలోనే ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. సీజన్‌లో కేడీఎస్ విత్తనాలే తమను నష్టాలపాలు చేశాయని అంటున్నారు. విత్తన కంపెనీలతో మాట్లాడి పరిస్థితి తెలుసుకుని నష్టం పూడ్చాలని కోరుతున్నారు.

రెక్కల కష్టం వృథా అయింది..



మా కుటుంబమంతా కష్టపడి పనిచేస్తాం. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తాం. యేటా సోయాపంటవేస్తాం. ఈయేడు కూడా సోయాపంట సాగుచేశాం. పంట పూర్తిగా పసుపు రంగుకు మారిపోయింది. విత్తనాలు అసలైనవో కావో తెలియడంలేదు. పదేళ్లుగా ఇదేపంట సాగుచేస్తున్నాం. కానీ ఇలా ఎన్నడూ జరగలేదు. ఎకరానికి రూ.23 వేలు ఖర్చుచేస్తే రూ.12 వేల ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదు.

– కల్యాణ్‌కర్ శేషారావు, రైతు

కోత ప్రారంభమైంది..

నిర్మల్ జిల్లాలో సోయాపంట కోతలు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలతో పంటకు అక్కడక్కడ తెగుళ్లువచ్చాయి. ఈయేడు సోయాపంట కొంత దెబ్బతింది. పూర్తిస్థాయిలో పంటకోస్తే దిగుబడి తెలుస్తుంది. భారీ వర్షాలు కురిసిన వెంటనే కొంత మంది రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. ఏఈవోలు కూడా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు సలహాలు ఇచ్చారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

బాసర జోనల్ క్రీడలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఆర్‌సీవో

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 9వ జోనల్‌స్థాయి క్రీడలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ శివరాజ్‌తో కలిసి ఆర్‌సీవో అలివేలు పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. బాసర జోన్ పరిధిలోని నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలలోని 14 గురుకుల పాఠశాలల నుంచి 1,200 మంది క్రీడాకారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. అండర్-14, 17, 19 విభాగాలో కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, అథ్లెటిక్స్ నిర్వహిస్తారు. ప్రారంభోత్సవం సందర్భంగా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇటీవల దక్షిణాఫ్రికా ప్రిటోరియాలో నిర్వహించిన టెన్నికాయిట్ పోటీలో బంగారు పతకం సాధించిన డిగ్రీ విద్యార్థిని త్రిషను సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరస్వతి, క్రీడల నిర్వాహకులు నీరజ, షీటీం ఎస్సై సుమాంజలి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నిర్మల్ టౌన్: అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్ మాట్లాడుతూ.. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ఇంతవరకు వ్యాక్సిన్ తీసుకోని, డ్రాప్‌ఔట్ అయిన పిల్లలు, గర్భిణులకు టీకాలు ఇచ్చి నూటికి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నిఖిలరాణి, మీడియా అధికారి రవీందర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

'బెల్ట్' తీస్తున్నారు..!


భైంసారూరల్ : బెల్ట్ షాపుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

జంగ్ తెలంగాణ

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల విస్తృత తనిఖీలు
- జిల్లావ్యాప్తంగా పట్టుబడుతున్న మద్యం

భైంసాటౌన్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. అక్రమంగా మద్యం, నగదు రవాణాపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే దాబాలు, బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా చేస్తున్న మద్యాన్ని పట్టుకుంటున్నారు. దీంతో బెల్ట్ దుకాణాల నిర్వాహకులు బెంబేలెత్తుతున్నారు. కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచే పోలీసులు 'బెల్ట్' తీయడం ప్రారంభించారు. భైంసా పట్టణ పరిధిలో మూడురోజుల వ్యవధిలోనే దాదాపు రూ.లక్షన్నర విలువైన మద్యం పట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం బెల్ట్ దుకాణాలపై దాడులు చేస్తున్నారు. బెల్ట్ దుకాణాలకు అనుమతి లేకున్నా ఊరూరా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఎమ్మార్పీపై రూ.20 నుంచి రూ.30 వరకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తుంటారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసే జరుగుతున్నా 'మామూలు'గా వ్యవహరిస్తారన్న విమర్శలున్నాయి.

కోడ్‌తో హడావుడి...
ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు ఎన్నికల నియమావళి కఠినంగా అమలు చేస్తున్నారు. కోడ్ మొదలైన మొదటిరోజే పోలీసులు దాబాల్లో తనిఖీలు చేపట్టి మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ దుకాణాలు సైతం సోదాలు జరిపి మద్యం పట్టుకున్నారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చినప్పుడో, లేదా టార్గెట్ కోసమో తనిఖీలు జరిపి అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై దృష్టి పెట్టే అధికారులు మిగతా సమయాల్లో సైతం ఇదే తీరున వ్యవహరించాలని మహిళలు కోరుతున్నారు.

'మహా' మద్యంపైనే నజర్..
పోలీసులు ఓవైపు బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహిస్తూ మద్యం స్వాధీనం చేసుకుంటుండగా, ఎక్సైజ్ శాఖ అధికారులు మహారాష్ట్ర నుంచి వచ్చే మద్యంపై నజర్ పెట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మహారాష్ట్ర సరిహద్దుల్లో బృందాలుగా ఏర్పడి గస్తీ కాస్తున్నాయి. సరిహద్దున ఉన్న కుబీర్, తానూర్, బాసర, ముధోల్‌తోపాటు కుంటాల, సారంగపూర్ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నిర్మల్, భైంసా ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 62 మహారాష్ట్ర లిక్కర్ కేసులు నమోదు కాగా, 33 దేశీదారు కేసులు నమోదయ్యాయి.

కోడ్ అమలు నాటి నుంచి నమోదైన కేసుల వివరాలిలా..

మద్యం తరలింపు కేసులు : 43
స్వాధీనం చేసుకున్న మద్యం 1,166.23 లీటర్లు(రూ.5,77,858)
నగదు తరలింపు కేసులు : 06
పట్టుబడిన నగదు : రూ.14,58,580

మద్యం పట్టివేత

భైంసారూరల్: మండలంలోని దేగాం, కామోల్ గ్రామాల్లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేశారు. బెల్ట్‌షాపుల్లో మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ.94,200 ఉంటుందని సీఐ నైలు తెలిపారు. తనిఖీల్లో ఎస్సై శ్రీకాంత్, పాల్గొన్నారు.

కుంటాలలో..
కుంటాల: మండలంలోని లింబా(బి), అంబకంటి తండాల్లోని బెల్ట్ షాపులపై ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేశారు. లింబా(బి) బెల్టుషాపుతోపాటు ఓ ఇంట్లో, అంబకంటి తండాలో అక్రమ నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నారు. దీని విలువ రూ.81,750 ఉంటుందని ఎస్సై తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సారంగాపూర్‌లో రూ.30 వేల మద్యం..
సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి-కౌట్ల(బి) రహదారిపై శుక్రవారం వాహనాలు తనిఖీ చేసే క్రమంలో కౌట్ల(బి) గ్రామానికి చెందిన ఓవ్యక్తి మద్యం బాటిళ్ల తరలిస్తూ పోలీసుకు పట్టుబడ్డాడు. ఆయన నుంచి రూ.30 వేల విలువైన మద్యం పట్టుకున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

కలెక్టర్‌గా ఆశీష్ సాంగ్వాన్

- బాధ్యతల స్వీకరణ
- జిల్లాకు వరుసగా మూడో ఐఐటీయన్


కలెక్టర్ అశీష్‌సాంగ్వాన్

నిర్మల్: జిల్లా కొత్తబాస్‌గా యువ ఐఏఎస్ అశీష్‌సాంగ్వాన్ నియమితులయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడురోజుల క్రితం వరుణ్‌రెడ్డిపై వేటుపడింది. ఆయన స్థానంలో అశీష్‌సాంగ్వాన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.


మూడో ఐఐటీయన్..
జిల్లాకు వరుసగా ఐఐటీయన్‌లే కలెక్టర్లుగా నియమితులవుతున్నారు. జిల్లా మూడో కలెక్టర్‌గా వచ్చిన ముషరఫ్‌అలీ చెన్నై ఐఐటీ, నాలుగో కలెక్టర్ వరుణ్‌రెడ్డి బాంబే ఐఐటీలో చదవగా.. ప్రస్తుత కలెక్టర్ అశీష్ ఢిల్లీ ఐఐటీలో కంప్యూటర్స్ సైన్స్ పూర్తిచేశారు. ఉన్నతవిద్య కోసం అమెరికా వెళ్లి అక్కడి జార్జియా యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) పూర్తిచేశారు. గత కలెక్టర్ల తరహాలోనే సైక్లింగ్, వాకింగ్, రన్నింగ్ ఆటలపై సాంగ్వాన్‌కూ మక్కువ ఉండటం గమనార్హం. స్వల్పవ్యవధిలోనే వరుణ్‌రెడ్డి బదిలీ అయినా ఆయన స్థానంలో యువ కలెక్టర్ రావడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

2016 బ్యాచ్.. మధ్యప్రదేశ్ క్యాడర్..
హర్యానా రాష్ట్రంలోని భివానీకి చెందిన అశీష్‌సాంగ్వాన్ ఉన్నతవిద్యను అభ్యసించారు. సివిల్స్ టార్గెట్‌గా ప్రిపేరవుతూ మూడోసారికి ఐఏఎస్ సాధించారు. 2013లో ముందుగా 607 ర్యాంక్‌తో రైల్వేస్‌లో అధికారిగా జాయిన్ అయ్యారు. 2014లో రెండోసారి మెరుగైన ర్యాంక్ రాకపోవడంతో పట్టుదలతో మూడోసారి 2015లో సివిల్స్ రాసి ఏకంగా 12వ ర్యాంక్ సాధించారు. అలా ముస్సోరిలో సివిల్స్ ట్రైనింగ్ పూర్తిచేసుకుని మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్‌గా విధుల్లో చేరారు. ఆ రాష్ట్రంలో అసిస్టెంట్ కలెక్టర్, జెడ్పీ సీఈవో తదితర హోదాల్లో పనిచేశారు.

భార్య పనిచేసిన చోటుకు..
తను చదివిన ఢిల్లీ ఐఐటీలోనే చదివి, తను సాధించిన 2015 సివిల్స్‌లోనే ఉత్తమ ర్యాంక్ సాధించి, తనతో పాటే 2016 బ్యాచ్ ఐఏఎస్ గా ఎంపికైన వల్లూరు క్రాంతిరెడ్డిని అశీష్‌సాంగ్వాన్ ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. ఈక్రమంలోనే ఆయన మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ క్యాడర్‌కు మార్చుకున్నారు. తెలంగాణలో వనపర్తి స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్‌గా చేశారు. ప్రస్తుతం సీసీఎల్ఏలో నుంచి కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇక ఆయన భార్య క్రాంతి ప్రస్తుత జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్. క్రాంతిరెడ్డి ట్రైనింగ్‌లో భాగంగా 2017లో నిర్మల్ జిల్లాకు వచ్చారు. జిల్లాలో దాదాపు ఏడాదికి పైగా ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పుడు ఇదే నిర్మల్ జిల్లాకు ఆమె భర్త అశీష్ కలెక్టర్‌గా నియమితులు కావడం విశేషం.

నిర్మల్.. సంతృప్తినిచ్చింది..

- వరుణ్‌రెడ్డి



నిర్మల్: జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసింది స్వల్పకాలమే అయినా నిర్మల్ చాలా సంతృప్తినిచ్చిందని వరుణ్‌రెడ్డి అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు బాధ్యతలు వీడిన ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. చిన్న జిల్లా అయినప్పటికీ ఇక్కడి ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారని, ఇందుకోసం తమవంతుగా సహకారం కూడా అందిస్తారని చెప్పారు. తన హయాంలోనే సమీకృత కలెక్టరేట్, మెడికల్ కాలేజీ ప్రారంభం కావడం, విద్య, ఉపాధిహామీ, స్త్రీనిధిలో రాష్ట్రంలోనే జిల్లా ఉత్తమంగా ని లువడం గుర్తుండిపోతుందన్నారు. వైద్యపరంగా జిల్లాలో ప్రధానలోపమైన రక్తహీనతను తగ్గించడానికి చేపట్టిన 'అనిమీయా సే ముక్త్ నిర్మల్' చాలా సంతృప్తినిచ్చిందని చెప్పారు. జిల్లాకేంద్రంలోని చారిత్రక ప్రదేశాల పరిరక్షణ, అభివృద్ధి కొరకూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అన్నిరంగాల్లో జిల్లాను అభివృద్ధి చేయానికి తనవంతు కృషిచేశానని వెల్లడించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి : ఏఎస్పీ పాటిల్

భైంసాటౌన్: ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. దమ్మచక్ర పరివర్తన్ దివస్ నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో దళిత సంఘాల ప్రతినిధులు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. సీఐ ఎల్.శ్రీను, ఎస్సైలు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి


నిర్మల్ రూరల్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు ప్రతీ కార్యకర్త కష్టపడాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. ఇంటింటికీ బీజేపీ – గడప గడపకూ మహేశన్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఆయన పర్యటించారు. నిర్మల్‌లో కాషాయ జెండా ఎగిరేలా పని చేయాలన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి, తన కుటుంబ సభ్యుల, అనుచరుల ఆస్తులు పెంచడమే ధ్యేయంగా పని చేశారని ఆరోపించారు. జిల్లాకు మేలు చేయని మంత్రికి ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఇందులో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మ రాజు, అయ్యన్నగారి రాజేందర్, సాధం అరవింద్, శంకర్ పతి, భూపతిరెడ్డి, అల్లం భాస్కర్, భీంరెడ్డి, జింకసూరి, విఠల్, అనిల్, వెంకటేశ్‌పోశెట్టి, గంగయ్య, సాయినాథ్, వెంకటేశ్, తిరుమల పాల్గొన్నారు.


రామ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం

నిర్మల్: మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ మసీదుల వద్ద శుక్రవారం పలువురు ముస్లిం మతపెద్దలను కలిశారు. ఆరు గ్యారెంటీ హామీలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లు పూర్తయినా నెరవేర్చలేదని ఆరోపించారు. పట్టణంలో హజ్‌హౌస్, షాదీఖానా, కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని చెప్పిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో ముస్లింలు మంత్రికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో అంజుమంద్‌అలీ, అజహర్, అతిక్ అహ్మద్, వాజిద్ అహ్మద్‌ఖాన్, సబాకలీం, సజ్జద్, రఫీ పాల్గొన్నారు.

గ్యారెంటీ స్కీంలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
నిర్మల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ స్కీంలను కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సూచించారు. సారంగాపూర్ మండలం సాయినగర్‌తండా,


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ రూరల్ మండలం అనంతపేట గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దళిత, బీసీ, మైనార్టీబంధు పేరుతో సీఎం కేసీఆర్ అన్నివర్గాలను మోసం చేశారన్నారు.

క్లుప్తంగా

క్రెడిట్‌కార్డ్ హ్యాక్ చేసి డబ్బులు కాజేసిన మోసగాళ్లు

సోన్: మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన బర్మా దేవన్న ఏటీఎం ద్వారా సైబర్ నేరస్తులు హ్యాక్ చేసిన రూ.1,23,270 నగదును పోలీసులు రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవన్న వారం క్రితం ఏటీఎంలో డబ్బులు డ్రా చేద్దామని వెళ్లాడు. డెబిట్ కార్డుకు బదులు క్రెడిట్ కార్డు పెట్టగా కార్డు బ్లాక్ అయినట్లు వచ్చింది. తన అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు తన డబ్బులను హ్యాక్ చేశారని పోలీస్‌స్టేషన్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవీందర్ సీసీటీఎన్ఎస్ రైటర్ రాజు పిటిషన్ అప్లోడ్ చేసి రోజువారీగా మానిటర్ చేస్తూ సైబర్ నేరగాళ్ల అకౌంట్ హోల్డ్ చేసిన పూర్తి డబ్బులు తిరిగి బాధితుడి అకౌంట్‌లోకి రికవరీ చేయించారు.

సాహస ఉద్యోగులకు 'ప్రశంస'



సజ్జనార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న భగవంత్‌రావు, శ్రీనివాస్

కుంటాల: మండల కేంద్రానికి చెందిన మేసినేని భగవంత్‌రావు భైంసా డిపోలో సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్‌గా, ఆదిలాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వానాకాలంలో కురిసిన భారీ వర్షం కారణంగా డిపోలోకి వరద నీరు రాగా, వీరు సాహసం చేసి వరదలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసి రక్షించారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించింది. ఇటీవల హైదరాబాద్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వీరికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. వీరికి ఆర్ఎం సోలోమాన్ రాజ్, భైంసా డీఎం అమృత అభినందనలు తెలిపారు.

మద్యం పట్టివేత

బోథ్: మండలంలోని పలు ప్రాంతాల్లో ఎస్సై రాము ఆధ్వర్యంలో గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో భారీగా మద్యం లభ్యమైంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి పలు గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. కనుగుట్ట గ్రామంలో కుమ్మరి నరేందర్, బీరం పోశెట్టి వద్ద రూ.2,333, ధన్నూర్ బీ గ్రామంలో దోపతి నవీన్ వద్ద రూ.54,873, సొనాలలో రమేశ్ వద్ద రూ.3,909, గుర్రాలతండా గ్రామంలో చౌహాన్ సంజయ్ వద్ద రూ.4,899 విలువైన అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుబడింది. నాగాపూర్ గ్రామంలో జాదవ్ రామారావ్ వద్ద ఐదు లీటర్ల గుడుంబా లభించింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరూ అక్రమంగా మద్యం విక్రయించరాదని తెలిపారు. నిరంతరం తాము తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కల్తీ కట్టడే ప్రధానం

- వస్తు వినియోగంలో నాణ్యత కీలకం
- నేడు ప్రపంచ ప్రమాణాల దినోత్సవం



ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్:	ఫిర్యాదుల పరిష్కార సమయం:
1860425333	48గంటలు

- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సురేశ్ వంటనూనె కొనడానికి ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. లీటర్ మంచినూనె ప్యాకెట్ కొన్నాడు. చెక్ చేస్తే అందులో 900మిల్లీ లీటర్లు మాత్రమే ఉంది. ప్రముఖ కంపెనీ లోగోతో కూడిన ఆ నూనె తయారీ సంస్థ కూడా ప్రమాణాలు పాటించలేదని ఈ ఘటనతో తేటతెల్లమైంది.
- వెంకటరమణ భైంసా పరిసర ప్రాంతాల్లో విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై గ్రామాలు తిరుగుతుంటాడు. ఒకరోజు ఓ పెట్రోల్ బంకుకు వెళ్లిన అతడు రెండులీటర్ల పెట్రోలు పోయించుకున్నాడు. కొద్ది కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత పెట్రోలు అయిపోయింది. అతడికి అనుమానం వచ్చి అదే పెట్రోల్ బంక్‌లో బాటిల్‌లో లీటర్ పెట్రోలు పోయించి చూడగా 80 మిల్లీలీటర్లు తక్కువగా వచ్చింది. దీంతో అతడు అవాక్కయ్యాడు.

ఈ రెండేకాదు.. మరెన్నో ఘటనలు మన కళ్లముందే కనిపిస్తుంటాయి. వినియోగదారుడికి నాణ్యత ప్రమాణాలను అందించాల్సిన బాధ్యత ఆయా సంస్థలది. దాని పర్యవేక్షణ సంబంధిత ప్రభుత్వ శాఖలది. ఈ నేపథ్యంలో నేడు 'ప్రపంచ ప్రమాణాల దినోత్సవం' (వరల్డ్ స్టాండర్డ్స్ డే) సందర్భంగా ప్రత్యేక కథనం..

నిర్మల్‌ఖిల్లా: ప్రజలు అనుదినం వస్తు సేవలపై ఆధారపడుతున్నారు. ఉదయం లేచింది మొదలు ప్రతీది కొనుగోలు చేయాల్సిందే. నిత్యావసరాలైన పప్పులు, ఉప్పులు మొదలు తదితర వస్తువులన్నీ కొనుగోలు చేస్తుంటారు. మనం కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యతగా ఉన్నాయా.. కొలతలు సరిగా ఉన్నాయా.. అంటే ఏమో అనుమానమే. వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు చట్టబద్ధమైన అధికారాల ద్వారా నిర్దేశించేందుకు 14.10.1946న లండన్‌లో అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ ఏర్పాటైంది. 25 మంది సభ్యులతో ప్రారంభించిన ఈ సంస్థలో ప్రస్తుతం 125 సభ్యదేశాలున్నాయి. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (భారతీయ ప్రమాణాల సంస్థ) చట్టాన్ని ఆమోదించి ఒక శాసనబద్ధమైన సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐఎస్ఐ ముద్ర ప్రకటించబడింది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినవని అర్థం.

తరచూ దృష్టికి వచ్చే అంశాలు

- పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ అమ్మకాల్లో తేడాలు, కల్తీ.
- తినుబండారాల్లో ఒకే కంపెనీ లోగోతో నకిలీ ఆహార పదార్థాలు.
- రైతులు తమ పంట పొలాల్లో వేసే విత్తనాలు, ఎరువుల కల్తీ.
- నకిలీ కంపెనీలతో కూడిన సరుకులు.
- నూనెలు, పప్పు దినుసులు, వివిధ రకాల ఆహార పదార్థాల్లో కల్తీ.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదితంతో కూడిన లైసెన్స్ లేకుండా నకిలీ లోగోలతో అమ్మకాలు.
- వినియోగ తేదీ దాటిన పదార్థాలు, తినుబండారాల అమ్మకాలు.

రెండేళ్లకోసారి ప్రామాణిక ముద్రలు

తూనిక రాళ్లకు ప్రతీ రెండేళ్లకోసారి తూనికలు, కొలతల శాఖ నుంచి ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలి. ఇందుకు కొంత నగదును తూనికలు, కొలతల శాఖకు ఫీజు రూపంలో చెల్లించాలి. అదే ఎలక్ట్రానిక్ కాంటా అయితే ఏడాదికి ఒకసారి తనిఖీలు చేయించుకుని స్టాంపులు వేయించుకోవాలి.

పర్యవేక్షణ ఉండాలి



జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల ఆహార పదార్థాలు, ధాన్యాలు, సాంకేతికపరమైన వస్తువులు, ముడి సరుకులు ఎన్నో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్నారు. వీటిపై సంబంధిత శాఖ ప్రత్యేక నిఘా పెట్టి అమ్మకాలను నిషేధించాలి. వీటి తయారీపై దృష్టి సారించాలి. నాణ్యతా ప్రమాణాలపై ప్రజల్లో చైతన్యం తేవాలి.

– నంద అనిల్, సామాజిక కార్యకర్త, దిలావర్‌పూర్

తగినన్యాయం పొందవచ్చు



వినియోగదారులు మోసాలకు గురికాకుండా జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులు చర్యలు తీసుకుంటారు. తూనికలు, కొలతలు సరిచూసి రెండేళ్లకోసారి అధికారిక ముద్రలు వేస్తారు. ప్రజలు చెల్లించే ప్రతీ పైసాకు వస్తు సేవలు పొందేలా అవగాహన కల్పించాలి. ఈ విషయంలో ఏదైనా నష్టం జరిగితే వినియోగదారుల ఫోరం ద్వారా తగిన న్యాయం పొందవచ్చు.

– పీ వంశీకృష్ణ, న్యాయవాది, నిర్మల్

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై సందీప్

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్ నుంచి భైంసా వైపు వెళ్తున్న ఓ వాహనాన్ని బెల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అందులో రూ.1.40 లక్షల నగదు ఉండగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తరలించవద్దని, అంతకంటే ఎక్కువ తీసుకువెళ్లాలంటే తప్పనిసరిగా సంబంధిత ఆధారాలు చూపాలని సూచించారు.

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన టేకం బాలు తన కారులో రూ.1.96 లక్షల నగదుతో నిర్మల్ బస్టాండ్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా స్థానిక బైల్ బజార్ వద్ద పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అలాగే కొట్లకే గ్రామానికి చెందిన వెంకటరమణ మోటార్ సైకిల్ కవర్లో రూ.8 లక్షలతో నిర్మల్ బస్టాండ్ నుంచి మంచిర్యాల చౌరస్తా వైపు వెళ్తూ స్థానిక జయశంకర్ చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. వీరిద్దరి డబ్బులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ అధికారికి పంపినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో ఎస్సై యాసిర్ అరాఫత్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.8,94,233 నగదు తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్ సీఐ శ్రీనివాస్, పోలీసులు పాల్గొన్నారు.

సర్సాపూర్(జి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ఆర్మూర్ పట్టణానికి చెందిన గంగామోహన్ ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.18 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం నగదును సీటీవో నిర్మల్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

జ్వరంతో విద్యార్థిని మృతి



జంగుబాయి (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: జ్వరంతో ఆదిలాబాద్ రూరల్ మండలం టెకిడిగూడ గ్రామానికి చెందిన బీర్షావ్–సూర్యకళ దంపతుల కుమార్తె రాయిసిడాం జంగుబాయి (14) మృతి చెందింది. వివరాలు.. జంగుబాయి మండలంలోని మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట ఆమెకు జ్వరం రాగా కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి జంగుబాయి శుక్రవారం మృతి చెందింది. కాగా, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ కూతురు మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం అశోక్‌ను వివరణ కోరగా.. జ్వరంతో బాధపడుతున్న జంగుబాయికి స్థానికంగా చికిత్స చేయిస్తున్నామని, ఆమె తల్లిదండ్రులే వినిపించుకోకుండా ఇంటికి తీసుకువెళ్లారని తెలిపారు. కాగా, వార్డెన్, హెచ్ఎం నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ ఆరోపించారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

దొంగచింతలో ఒకరు..



లక్ష్మణ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: జ్వరంతో మండలంలోని దొంగచింత గ్రామానికి చెందిన కనక లక్ష్మణ్ (32) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం తీవ్రం కావడంతో గురువారం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు.

భార్య మృతికి కారకుడైన భర్తకు జైలు

నిర్మల్‌టౌన్: భార్య మరణానికి కారకుడైన భర్తకు నిర్మల్ న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంబి మండలం మందపల్లి గ్రామానికి చెందిన తలారి ఉషన్న, శివక్క (50) దంపతులకు గ్రామ శివారులో 4.04 ఎకరాల భూమి ఉంది. ఇందులో మక్క, వరి, పసుపు సాగు చేస్తారు. 2019లో మక్క సాగు చేశారు. కంకి దశలో ఉన్న పంటను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు ఉషన్న చుట్టూ తీగ అమర్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. 9.10.2019న ఉషన్న మరిచిపోయి రాత్రి పూట కరెంట్ కనెక్షన్ తీయకుండానే ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత ఇది గమనించని అతడి భార్య శివక్క పంట చేనుకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంట్ తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందింది. దీనిపై మృతురాలి అన్న గంధం నర్సయ్య పెంబి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై భవాని సేన్ కేసు నమోదు చేసి తదుపరి పరిశోధన నిమిత్తం అప్పటి సీఐ, ప్రస్తుత డీఎస్పీ జయరాంకు అప్పగించారు. డీఎస్పీ జయరాం పరిశోధన చేసి ఉషన్నను కోర్టులో హాజరుపరిచారు. పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా ఉషన్నకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు.

అప్పుల బాధతో ఆత్మహత్య




భీమన్న (ఫైల్)

లోకేశ్వరం: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన సుంకరి భీమన్న (40) చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన భీమన్నకు చెందిన ఇల్లు భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో అప్పు చేసి ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నాడు. ఇందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకూ రాలేదు. అతడి ఆచూకీ కోసం వెతకగా శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని బీబీ తలాబ్ చెరువులో మృతదేహం కనిపించింది. అప్పుల బాధతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాటి మహిషాపురమే

నేటి భైంసా



- గుట్టపై వెలసిన గట్టు మైసమ్మ
- ఏటా ఘనంగా ఉత్సవాలు
- భైంసాలో ప్రత్యేక దుర్గాదీక్షలు
- అడుగడుగునా మండపాలు

భైంసా: ఒకప్పటి మహిషాపురమే నేడు భైంసా పట్టణంగా పిలువబడుతోంది. కాలక్రమేణా మైస ఇప్పుడు భైంసాగా మారింది. చరిత్రను తెలిపే రాతితో చెక్కిన మహిషాపాదాలు ఇప్పటికీ భైంసాలో ఉన్నాయి. పట్టణంలోని కుంటగల్లిలోగల ఫిల్టర్ బెడ్ సమీపంలో ఈ పాదాలు కనిపిస్తాయి. దసరా నవరాత్రుల్లో భైంసా పట్టణంలో గత చరిత్రను ఆధారంగా చేసుకుని పూజలు చేస్తుంటారు. శనివారం అమావాస్య రావడంతోనే ఇక్కడ పూజలు ప్రారంభంకానున్నాయి. ఆదివారం నుంచి భైంసా పట్టణంలో నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఇదీ చరిత్ర..



కుంటగల్లిలో రాతితో చెక్కిన మహిషా పాదాలు

ఈ ప్రాంతంలో గతంలో మహిషాసుర రాక్షసుడు ఇక్కడి ప్రజలను కష్టాలపాలుచేసి సుఖఃశాంతులు లేకుండా జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాడని పురాణాల్లో రాసి ఉంది. అయితే ఇక్కడ ఉండేవారు మహిషాసుర రాక్షసుడి నుంచి విముక్తి పొందేందుకు దుర్గాదేవి ని వేడుకున్నారు. దుర్గాదేవి మహిషా అవతారంలో మహిషాసురుడిని వధించి ప్రజలను విముక్తులను చేసిందని పురాణగాథలు చెబుతున్నాయి. అప్పటి నుంచి పాడి పంటలు, ఆయురారోగ్యాలతో జీవనం గడిపే స్థానికులు ఈ ప్రాంతానికి మహిషాగా నామకరణం చేశారు. సాక్షాత్తు దుర్గాదేవే ఈ రూపంలో వచ్చి ప్రజలను ఆదుకున్నందుకు చిరకాలంగా గుర్తుండేలా అప్పటివారు రాతితో పాదాలు చెక్కించారు. రాతి పాదాలపై చెక్కిన కళాకృతులు ఇప్పటికీ కనిపిస్తాయి. ఇందుకు గుర్తుగా సమీపంలోని గుట్టపై మైసమ్మ మందిరాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో దుర్గాదేవి గట్టు మైసమ్మగా పూజలందుకుంటోంది.

అప్పటి మహిషా.. నేటి భైంసా



గట్టుమైసమ్మ విగ్రహం

దుర్గాదేవి మహిషా రూపంలో వెలియగా ఈ ప్రాంతాన్ని మహిషాగా నామకరణం చేశారు. నాటి కాలంలో ఈ ప్రాంతాన్ని మహిష్మతి నగరంగా పిలిచేవారని చెబుతుంటారు. రానురాను మహిషా కాస్త మైసాగా.. కాలక్రమేణా భైంసాగా రూపాంతరం చెందింది. ఇప్పటికీ మహారాష్ట్ర వాసులు ఈ పట్టణాన్ని మైసాగానే పిలుస్తుంటారు. హిందువులు ప్రతీ పండుగలోనూ పట్టణాన్ని మహిషాగా ఫ్లెక్సీల్లో రాసి శుభాకాంక్షలు తెలుపుతుంటారు.

ప్రత్యేక దీక్షలు..

ఆదివారం నుంచి భైంసా డివిజన్‌వ్యాప్తంగా దుర్గా దీక్షలు స్వీకరించనున్నారు. ఇక్కడి యువకులు నవరాత్రుల అనంతరం ఏటా మహా పాదయాత్రగా మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు వెళ్తుంటారు. దుర్గా దీక్షలు స్వీకరించి నవరాత్రుల అనంతరం భైంసా పట్టణం నుంచి ఏటా పాదయాత్ర బృందం తుల్జాపూర్‌కు వెళ్తుంటుంది. చదువుల తల్లి సరస్వతీ అమ్మవారు కొలువై ఉన్న బాసరకు 26 కిలో మీటర్ల దూరంలో ఉన్న భైంసా పట్టణంలో దుర్గాదేవి మైసమ్మగా ప్రత్యేక పూజలందుకుంటోంది. పట్టణానికి చెందిన రామ్‌లాల్ కుటుంబీకులు దశాబ్దాలుగా అమ్మవారి సేవలో ఉంటున్నారు. పట్టణంలో యువకులంతా దసరా నవరాత్రుల్లో ప్రత్యేక దీక్షలు స్వీకరిస్తారు. తొమ్మిది రోజులపాటు కాళ్లకు చెప్పులు లేకుండా పళ్లు, పలహారాలు స్వీకరించి దీక్షలు పూర్తి చేస్తారు. దీక్ష తీసుకున్న వారంతా గట్టుమైసమ్మ, దుర్గాదేవి ఆలయాల్లో సాయంసంధ్య వేళల్లో రెండు పర్యాయాలు స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇంతటి చరిత్ర ఉన్నందునే భైంసా పట్టణంలో వాడవాడలా దుర్గాదేవిని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఎన్నికల 'కిక్' లేనట్లే..!

- నవంబర్ వరకు పాత దుకాణాలకు గడువు
- కొత్తగా లైసెన్స్ దక్కించుకున్న వారిలో నిరాశ

లెక్క తప్పింది

భైంసాటౌన్: కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి ఈసారి ఎన్నికలు నిరాశనే మిగిల్చనున్నాయి. మద్యం అమ్మకాలకు కిక్ ఇచ్చే దసరా పండుగ ఇదే నెలలో ఉండగా, నవంబర్‌లో ఎన్నికలు ఉన్నాయి. నామినేషన్ వేసింది మొదలు పోలింగ్‌కు ముందు రోజు వరకు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇక మందుబాబుల గురించి చెప్పనక్కర్లేదు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి రోజూ మందు, విందుల్లో మునిగి తేలుతారు. ఎన్నికలు వచ్చాయంటే చాలు మద్యం అమ్మకాలు విపరీతంగా పెరుగుతాయి. కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి మాత్రం నిరాశ తప్పేట్టు లేదు. ఎందుకంటే, నవంబర్ తరువాత డిసెంబర్‌లోనే కొత్త దుకాణాలు ప్రారంభం కానున్నాయి. నవంబర్ 30న పోలింగ్‌తో ఎన్నికల తంతు ముగియనుంది. పాత దుకాణాలకు నవంబర్ వరకు గడువు ఉండడంతో కొత్త దుకాణదారుల్లో నిరాశ నెలకొంది. ఎన్నికలు డిసెంబర్‌లోనే ఉంటాయనుకుని టెండర్‌లో దుకాణాలు రాని వారు రూ.లక్షల్లో గుడ్‌విల్ చెల్లించి దక్కించుకున్న వారున్నారు. ఇప్పుడు వారితోపాటు కొత్తగా దుకాణాలు పొందిన వారిలో నైరాశ్యం నెలకొంది.

ఒకేరోజు రెండు పార్టీల్లోకి జంప్



గురువారం మధ్యాహ్నం ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి వెంకట్రామయ్య



గురువారం రాత్రి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న వెంకట్రామయ్య

అటు.. ఇటు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలకు చెందిన రైతు సమితి మండల కన్వీనర్ తూముల వెంకట్రామయ్య గురువారం మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే రోజు రాత్రి మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తనయుడు నడిపెల్లి విజిత్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. ఒక్క రోజే అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు మారి కండువాలు కప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు పూర్తయ్యే నాటికి ఇలాంటి వింతలు ఎన్ని చోటు చేసుకుంటాయో చూడాలి.

నెత్తిన టోపీ.. ఖద్దరు చొక్కా

ప్రత్యేకం..



గడ్డిగారి గడ్డెన్న, మాజీ మంత్రి

భైంసా: ముథోల్ నియోజకవర్గ వాసుల గుండెల్లో చిరకాలం నిలిచిన మాజీ మంత్రి గడ్డిగారి గడ్డెన్న ఎప్పుడూ నెత్తిన టోపీ.. ఖద్దరు చొక్కా కళ్లజోడుతో కనిపించేవారు. రాజకీయాల్లో అరంగేట్రం చేసిన నాటి నుంచి ఏనాడూ మరిచిపోలేదు. ఈ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దున ఉండడం.. ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఇలా సంప్రదాయబద్ధంగా టోపీ ధరించే వారు కనిపిస్తారు. గ్రామ సర్పంచు నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన దివంగత నేత గడ్డిగారి గడ్డెన్న ఏనాడూ ఆ టోపీ ధరించడం మరిచిపోలేదు. ఎప్పుడు చూసినా ఆయన వద్ద ఇలాంటి టోపీలు కుట్టి సిద్ధంగా ఉంచేవారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతటివారినైనా ఆయన పేరుపెట్టి పిలిచేవారు. కాకాగా ఈ ప్రాంత వాసులకు చిరస్మరణీయులు అయ్యారు.